సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



కిలో టమాట రూ.17

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.9, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.



పట్టుదలే వారి పథం

ఏపీ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఊహించని విధంగా ర్యాంక్‌లు దక్కించుకున్న పలువురు ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.1°/15.9°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నల్లమాడలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



బత్తలపల్లి మండలం నెట్టివారిపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



రామగిరి మండలం కుంటిమద్దిలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కొండంత అభిమానం

ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిలో రాష్ట్రాన్ని తనదైనశైలిలో ముందుకు తీసుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాయి. ముఖ్యమంత్రి జగనన్న ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

- జిల్లా వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- జగనన్న ఆయురారోగ్యాలతో ఉండాలంటూ ఆలయాల్లో పూజలు
- సంక్షేమ ప్రదాతే మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజాప్రతినిధుల ఆకాంక్ష

పుట్టపర్తి: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం సర్కిల్‌లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే కొత్తచెరువు, నల్లమాడ మండల కేంద్రాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జగన్ బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందిస్తున్న గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కొనియాడారు.



పెనుకొండ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండలో...

నియోజకవర్గం కేంద్రమైన పెనుకొండలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో తొలుత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేశారు. తర్వాత ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. పరిగిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. సానే ఉమారాణి ఆధ్వర్యంలో పెనుకొండలో జరిగిన రక్తదాన శిబిరానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వ్యక్తి జగన్ అని ఎమ్మెల్యే శంకరనారాయణ కొనియాడారు.

కదిరిలో....

కదిరి వేమారెడ్డి సర్కిల్‌లో ఎమ్మెల్యే పీవీ.సిద్దారెడ్డి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే 2 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పేదలకు ఇంటి పటాలిచ్చిన సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ధర్మవరంలో....

నియోజకవర్గంలోని బత్తలపల్లి మండలం జలాలపురం, నెట్టివారిపల్లి, గరసినలపల్లిలో సీఎం జగన్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జగన్ పారదర్శక పాలనలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

హిందూపురంలో...

హిందూపురంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని స్థానిక సీఅండ్ఐజీ చర్చిలో ఘనంగా నిర్వహించారు. కేక్ చేయడంతో పాటు వలంటీర్లకు దుస్తులు పంపిణీ చేశారు. సేవా మందిరంలో అంధుల పాఠశాలలో స్వీట్లు, బస్టాండ్ వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకురాలు మధుమతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏపీ అగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మైనార్టీ నాయకులు కట్ట బాషా, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

రామగిరిలో..

సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం కుంటిమద్ది హైస్కూల్‌లో విద్యార్థుల సమక్షంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కనగానిపల్లిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



కదిరి వేమారెడ్డి కూడలిలో కట్‌కటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



హిందూపురంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

- ఎస్పీ మాధవరెడ్డి

ముదిగుబ్బ: కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్, కంప్యూటర్ గది, రైటర్ గదులను పరిశీలించారు. అలాగే పలు రికార్డులను పరిశీలించి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసులను సమీక్షించారు. కేసు నమోదు మొదలు చార్జిషీటు దాఖలు వరకు, ఆ తర్వాత కొనసాగే కోర్టు ప్రాసెస్‌కు ప్రాపర్‌గా ముందుకెళ్లాలన్నారు. హోదాలు మరిచి పోలీసులందరూ రానున్న రోజుల్లో మరింత సమిష్టిగా పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలకు కారణమయ్యే వారిని గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల కట్టడిపై దృష్టి పెట్టాలన్నారు. వివిధ సమస్యలపై పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ట్రయినీ డీఎస్పీ పృథ్వీతేజ, సీఐ యతీంద్ర, ఎస్ఐ వంశీకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోండి

తాడిమర్రి/పుట్టపర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవాలని డీఈఓ మీనాక్షి విద్యార్థులకు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ముందుగా ఆమె ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్, హెచ్‌ఎం అరుణలతో కలసి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజనం సరుకుల నిల్వలు, పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

డీఈఓపై కలెక్టర్ ఆగ్రహం..

ఇది ఇలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని తలపెట్టగా జిల్లా స్థాయిలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టలేదని డీఈఓ మీనాక్షిపై కలెక్టర్ అరుణ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాన్ని డీఈఓ తేలికగా తీసుకొని పట్టీ పట్టనట్లుగా ఉదాసీనంగా వ్యవహరించటంతో పాటు ఎలాంటి సమాచారాన్ని తెలియపరచకపోవటంపైనా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.



తాడిమర్రిలో ట్యాబులు పంపిణీ చేస్తున్న డీఈఓ

బాధ్యతలు స్వీకరించిన జేసీ అభిషేక్



విధుల్లో చేరుతున్నట్లు సంతకం చేస్తున్న జేసీ

పుట్టపర్తి అర్బన్: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆదోని సబ్‌కలెక్టర్‌గా పని చేసిన ఆయనకు ఇటీవల ప్రభుత్వం పదోన్నతి కల్పించి జిల్లాకు జేసీగా పంపింది. గురువారం ఉదయమే కలెక్టరేట్ కు చేరుకున్న జేసీ బాధ్యతలు స్వీకరించారు. డీఆర్ఓ కొండయ్య, ఏఓ వెంకటనారాయణలు జేసీతో రిజిష్టర్ పుస్తకంలో సంతకం చేయించారు. అనంతరం కలెక్టరేట్‌లోని అన్ని బ్లాకులను సందర్శించి ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులంతా బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ బంగ్లాకు వెళ్లి కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా పరిస్థితులను జేసీకి వివరించారు. ప్రస్తుతం జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని కొంత మంది రైతులకు పరిహారం అందాల్సి ఉందన్నారు. భూముల రీసర్వే కూడా సగం పూర్తి కావచ్చిందన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో జిల్లాలోని పరిస్థితులను త్వరగా అర్థంచేసుకోవాలని సూచించారు.

'ముక్కోటి'కి ప్రత్యేక ఏర్పాట్లు




కదిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కదిరి: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఉత్తర గోపురం (వైకుంఠ ద్వారం) గుండా స్వామి వారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన రాజగోపురం వద్ద స్వాగత తోరణం మొదలుకొని ఆలయం మొత్తం సుందరంగా అలంకరిస్తున్నారు. వైకుంఠ ద్వారం వద్ద అలంకరణ వైకుంఠాన్ని తలపిస్తోంది. మహిళా భక్తులతో పాటు ప్రత్యేక దర్శనం కోసం వెళ్లే భక్తులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి ఏర్పాట్లను వివరించారు.

శనివారం అర్ధరాత్రి నుంచి దర్శనం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం అర్ధరాత్రి 2 గంటలకు ఆలయం తలుపులు తెరిచి అర్చక పండితులు స్వామివారిని అలంకరిస్తారు. తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడు ఉత్తర గోపురం వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం వేకువ జామున 3.15 గంటల నుంచి భక్తులకు ఉత్తర గోపురం గుండా శ్రీవారి దర్శన భాగ్యం ఉంటుంది. శుక్రవారం రాత్రి 9 గంటల నుంచే భక్తులను క్యూలైన్‌లోకి అనుమతిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు ముందు జాగ్రత్తగా ముక్కోటి ఏకాదశి నాడు పట్టణంలో వాహన రాకపోకలను దారి మళ్లించారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



పుట్టపర్తి: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్ఎస్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్, ఆ సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం ఓ ప్రకటనలో తెలియజేశారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఉచిత కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 4 నెలలు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు కోఆర్డినేటర్ విజయభారతిని సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఓటింగ్‌పై చైతన్యం తీసుకురండి

పుట్టపర్తి అర్బన్‌: ఓటరు నమోదు నుంచి ఓటు హక్కు వినియోగించడం వరకూ ప్రజలను చైతన్య పరచాలని అధికారులకు పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వీప్‌ కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాన్ని గురువారం సాయంత్రం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న ప్రతి గ్రామానికీ వెళ్లి ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగం, వీవీ ప్యాట్‌లపై ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చేందుకు ప్రచార జాతను చేపట్టినట్లు వివరించారు.

పాపం పసివాడు!


పోలీసుల సంరక్షణలో ఉన్న ధరణి

పుట్లూరు: పాపం ఓ పసివాడు.. కన్న తల్లిదండ్రుల నుంచి దూరమై ఒంటరిగా తిరుగుతుంటే చేరదీసిన పెంపుడు తండ్రికీ సమస్యగా మారాడు. వివరాలు.. పుట్లూరులోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉదయం అడ్మిషన్‌ కోసం ఓ బాలుడిని స్థానికుడు ఎరికల శేఖర్‌ తీసుకెళ్లాడు. అక్కడి ఉపాధ్యాయులు ఆధార్‌ కార్డు ఇవ్వాలని తెలపడంతో ఆ పిల్లాడికి ఆధార్‌ లేదని, అనాథగా తిరుగుతుంటే చేరదీశానని అమాయకంగా సమాధానం ఇవ్వడంతో ఉపాధ్యాయులు అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిబంధనల మేరకు పిల్లాడిని దత్తత తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఉపాధ్యాయులు తెలపడంతో తన కుటుంబ సభ్యులతో కలసి పోలీసులను శేఖర్‌ ఆశ్రయించాడు. తన భార్య వెంకటేశ్వరి ప్రసవానికి అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించినప్పుడు ఆ బాలుడు తమ వద్దకు వచ్చాడని, ఆకలితో బాధపడుతుంటే పిడికెడు అన్నం పెట్టడంతో తమనే అంటిపెట్టుకుని ఉండిపోయాడన్నారు. తల్లిదండ్రులు ఎక్కడ అని అడిగినా చెప్పలేదని, తన పేరు మాత్రం ధరణి అని చెబుతున్నాడని తెలిపారు. ఒంటరిగా వదిలేస్తే ఆకలిదప్పికలతో ఇబ్బంది పడతాడని భావించి తామే పెంచుకుందామని ఇంటికి పిలుచుకొచ్చినట్లు వివరించారు. శేఖర్‌ సమాచారం మేరకు వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు పిల్లాడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం విచారణ చేపట్టారు.

పట్టుదలే వారి పథం..
ఉన్నత ఉద్యోగం కైవసం

- పట్టుదలతో పోటీ పరీక్షలకు సిద్ధం
- ఫలితాల్లో అగ్రస్థానం
- ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించిన పేదింటి కుసుమాలు

'ప్రయత్నిస్తుండాలేగాని ఎంతటి కష్టతరమైన ఉద్యోగమైనా వచ్చితీరుతుంది. సాధించాలనే తపన లోలోపల రగులుకుంటే... వీధి దీపాల కింద చదువుకునైనా విశ్వవిజేత కావొచ్చు. పెద్దోళ్లకే అందలం అనే మాట వెనుకటిది. బీదాబిక్కీ సైతం ఊహించని ఎత్తుకు ఎదుగుతున్న కాలమిది. కలలు కనండి, ఆ కలలను సాకారం చేసుకోండి' అంటూ మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్‌ కలాం చేసిన ఉద్బోధతో ప్రభావితమైన ఉమ్మడి జిల్లాకు చెందిన యువత.. తమ సత్తా ఏమిటో చాటింది. ఇటీవల ఏపీ స్టేట్‌ పోలీస్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఊహించని విధంగా ర్యాంక్‌లు దక్కించుకున్న పలువురు ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించారు.

సీమ జోన్‌ స్థాయిలో 7వ ర్యాంక్‌


తల్లిదండ్రులతో ఆనందం పంచుకుంటున్న అఖిల్‌కుమార్‌ (వృత్తంలోని యువకుడు)

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం పంచాయతీ ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట అఖిల్‌కుమార్‌ వివిధ ఉద్యోగాల్లో మౌనంగానే ఎదుగుతూ వచ్చారు. లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి దంపతుల రెండో కుమారుడైన అఖిల్‌కుమార్‌... టెక్‌ మహీంద్రలో దాదాపు ఏడాదికిపైగా సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌గా పనిచేశారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన ఆయనను 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యేలా చేసింది. ప్రస్తుతం అగళి పోలీస్‌ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా.. టెక్నాలజీపై పూర్తి పట్టు ఉండడంతో డిప్యూటేషన్‌పై జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సైబర్‌ కంట్రోల్‌ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్‌ఐ పోటీ పరీక్షల్లో రాయలసీమ జోన్‌ పరిధిలో ఏడో ర్యాంక్‌ను దక్కించుకోవడంతో తల్లిదండ్రులతో పాటు, గ్రామస్తులూ హర్షం వ్యక్తం చేశారు.

ఓపెన్‌ కేటగిరిలో మూడో స్థానం



ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన చిగిచెర్ల గురుప్రసాద్‌, నాగరత్నమ్మ దంపతుల కుమార్తె చిగిచెర్ల లహరి... ఎస్‌ఐ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. 225 మార్కులతో ఓపెన్‌ కేటగిరి మహిళల విభాగంలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్న ఆమెను గ్రామస్తులు, బంధువులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఇది ఆరంభమే...



రాప్తాడు: వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన బాలగొండ చిన్న బాబయ్య, శివమ్మ దంపతులు తమ కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలనూ సమానంగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించారు. రెండో కుమార్తె హరిత అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకూ చదువుకుంది. 8 నుంచి ఇంటర్‌ వరకు ధర్మవరం పంగల్‌ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్‌ స్కూల్‌లో, ఎస్‌ఎల్‌ఎన్‌ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఈ క్రమంలోనే ఐఎఫ్‌ఎస్‌ సాధించాలనే తపనతో హైదరాబాద్‌లో కోచింగ్‌ తీసుకుంటుండగా ఆమెకు తెలియకుండా ఎస్‌ఐ పోటీ పరీక్షలకు నాన్న బాబయ్య దరఖాస్తు చేశాడు. ఈ విషయాన్ని తండ్రి ద్వారా తెలుసుకున్న ఆమె ఆయన ఆశయాన్ని నెరవేరుస్తూ తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించారు. అయితే ఇది కేవలం ఆరంభం మాత్రమేనని ఎలాగైనా ఐఎఫ్‌ఎస్‌ సాధించి తీరుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

రైతు ఇంట ఆనందం



బెళుగుప్ప: మండలంలోని రామినేపల్లికి చెందిన ఆంజనేయులు, సాలమ్మ దంపతుల కుమారుడు మంజునాథ్‌ చిన్నప్పటి నుంచి వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటూ వచ్చేవాడు. ఈ క్రమంలో అగ్రీ ఇంజినీరింగ్‌ పూర్తి చేశాడు. అయితే తన చిరకాల వాంఛగా ఉన్న ఎస్‌ఐ ఉద్యోగం సాధించాలనే తపనతో పోటీ పరీక్షల్లో నెగ్గి లక్ష్యాన్ని చేరకోవడంతో నిరుపేద రైతు కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్‌ రమేష్‌.. మంజునాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

పేదింట ఆనందాల హరివిల్లు



కంబదూరు: వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న కంబదూరు మండలం కుర్లపల్లికి చెందిన ఎరికల దురగప్ప, రత్నమ్మ దంపతులకు మూడో కుమారుడు అరుణాచలం... ఆర్డీటీ సహకారంతో బీటెక్‌ పూర్తి చేశాడు. ఎలాగైనా ఎస్‌ఐ ఉద్యోగం సాధించాలని పరితపించాడు. ఈ క్రమంలో పోటీ పరీక్షలకు సిద్ధమై పరీక్ష రాసి, 222 మార్కులతో సివిల్‌ ఎస్‌ఐగా తాను కలలు కన్న ఉద్యోగానికి అర్హత సాధించాడు. పట్టుదలే తమ కుమారుడిని ఉన్నత స్థానానికి చేర్చిందంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్యమే నడిపించింది



బ్రహ్మసముద్రం : చదువులే జీవిత గమనాన్ని మారుస్తాయన్న తల్లిదండ్రులు మాటలు స్ఫూర్తినిచ్చాయి. దీంతో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన ఆమెను ఎస్‌ఐగా అర్హత సాధించేలా చేసింది. బ్రహ్మసముద్రం మండలం సూగేపల్లికి చెందిన కురుబ భూలక్ష్మి, వన్నారెడ్డి దంపతులు చదువుసంధ్యలకు నోచుకోలేదు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం తప్ప మరే పని తెలియదు. తమ కష్టం తమ కుమార్తె జ్యోతి పడకూడదని భావించిన వారు ఆమెను చదువుల వైపు దృష్టి సారించేలా చేశారు. అనంతపురంలోని ఆర్ట్స్‌ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన అనంతరం చిన్నాన్న మల్లేష్‌ చొరవతో పోటీ పరీక్షలకు హైదరాబాద్‌లో ఆరు నెలల పాటు కోచింగ్‌ తీసుకుంది. ఆ సమయంలోనే ఇంట్లో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో తన తల్లిదండ్రులు అన్న మాటలు గుర్తుకు చేసుకుని పట్టుదలతో ఎస్‌ఐ ఉద్యోగానికి అర్హత సాధించింది.

గిరిజన ఆణిముత్యం



బెళుగుప్ప: మండలంలోని బ్రాహ్మణపల్లి తండాకు చెందిన వడిత్యా గోపాల్‌నాయక్‌, గీతాబాయి దంపతుల కుమారుడు వడిత్యా అశోక్‌కుమార్‌నాయక్‌ పోలీసు బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించారు. కళ్యాణదుర్గంలోనే డిగ్రీ వరకూ చదువుకున్న ఆయన ఎస్‌ఐ కావాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లోని కోచింగ్‌ సెంటర్‌లో శిక్షణ పొందారు. ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించడంతో తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకే ఊళ్లో ఇద్దరు




కళ్యాణదుర్గం రూరల్‌: కుర్లపల్లికి చెందిన గజేంద్ర, శ్రీవాణి ఎస్‌ఐ ఉద్యోగానికి అర్హత సాధించారు. మాలమ్మ, గంజన్న కుమారుడు గజేంద్ర కూలి పనులతో జీవనం సాగిస్తూనే ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించాడు. అలాగే శ్రీవాణి తల్లిదండ్రులు నాగలక్ష్మి, బాలాజీ... వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు ఉద్యో గాలు సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జనవాక్కు

జగనన్న మేలు మరవలేం



ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌ బాధ్యతలు తీసుకున్న తర్వాత మా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. సొంతంగా ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నా. నాకు ఏటా రూ.10 వేల చొప్పున నాలుగు దఫాలుగా వాహన మిత్ర పథకం ద్వారా రూ.40 వేల లబ్ధి చేకూరింది. నా కుమార్తెకు అమ్మఒడి పథకం కింద ఇప్పటి వరకూ రూ.56 వేలు, మా అమ్మకు వైఎస్సార్‌ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున మూడు సార్లు డబ్బులు పడ్డాయి. మా నాన్నకు ప్రతి నెలా 1వ తేదీన ఇంటి వద్దకే వలంటీర్‌ వచ్చి రూ.2,750 వృద్ధాప్య పింఛన్‌ అందజేస్తున్నారు. మరో పది కాలాల పాటు సీఎంగా వైఎస్‌ జగనే ఉండాలని మా కుటుంబ సభ్యులంతా కోరుకుంటున్నాము.

– ఎస్‌. రఘు, ఫణారం, గుడిబండ మండలం

జీవితంలో మర్చిపోలేను



సీఎం వైఎస్‌ జగన్‌ చేసిన మేలును జీవితంలో మర్చిపోలేను. అనారోగ్యం సమస్య కారణంగా నాకు రెండు కిడ్నీలు పని చేయవు. దీంతో వారానికి రెండు సార్లు డయాలసిస్‌ చేయించుకోవాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం జగన్‌ నాలాంటి కిడ్నీ బాధితుల కోసం ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా డయాలసిస్‌ చేయించుకునే అవకాశం కల్పించారు. దీంతో వారానికి రెండు సార్లు హిందూపురం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి డయాలసిస్‌ చేయించుకుంటున్నా. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్యంగా ఉంటున్నా. అలాగే ప్రతి నెల రూ.10 వేలు పింఛన్‌ రూపంలో ఇంటి వద్దకే వలంటీర్‌ వచ్చి ఇస్తున్నాడు. ఇద్దరు పిల్లలకు విద్య, వసతి దీవెన పథకాలు వర్తించాయి. వారి చదువులు సజావుగా సాగుతున్నాయి.

– చంద్రబాబు, టీడీ పల్లి, రొళ్ల మండలం

ఉచితంగానే ధ్రువీకరణ పత్రం



జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రం పొందాను. గత ప్రభుత్వంలో ఇదే సర్టిఫికెట్‌ పొందేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయంలోనే అన్ని పనులూ చక్కబెడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగాల్సిన పనిలేదు. నాకు అందిన ధ్రువీకరణ పత్రంతో జగనన్న చేదోడు పథకం వర్తించింది. పొదుపు సంఘాల్లోకి, పిల్లలను బడిలో చేర్పించేటప్పుడు నాకు చాలా ఉపయోగపడుతుంది.

– మాల్యవంతం లక్ష్మి, బత్తలపల్లి

రూ.లక్ష లబ్ధి చేకూరింది



డాక్టర్‌ వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా పథకం కింద రూ.1,18,000 లబ్ధి చేకూరింది. సాగు చేసిన పంటలకు ఒక్క పైసా కూడా ప్రీమియం నేను చెల్లించలేదు. నాకున్న ఆరు ఎకరాలకు పైగా భూమిలో చీనీ చెట్లు సాగు చేశా. వాతావరణంలో మార్పులు కారణంగా పంట నష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో 2022లో రూ.51 వేలు, ఈ ఏడాది రూ.61 వేలు పరిహారాన్ని జగన్‌ ప్రభుత్వం అందజేసింది. గతంలో పండ్ల తోటలు నష్టపోతే రైతులకు పరిహారం అందేది కాదు. రైతులకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలి.

– ఓంప్రసాదరెడ్డి, కాటమకుంట, బత్తలపల్లి మండలం

పేదలకు 'పట్టా'భిషేకం



ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్ధారెడ్డి, హాజరైన లబ్ధిదారులు

- పేదల సొంతింటి కల సాకారమే సీఎం వైఎస్‌ జగన్‌ లక్ష్యం
- 2 వేల మందికి ఇంటి పట్టాల పంపిణీ
- కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్ధారెడ్డి

కదిరి: పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయాన్ని సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లిఖించారని కదిరి ఎమ్మెల్యే డాక్టర్‌ పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మందికి ఇంటి పట్టాలు అందజేసి, పక్కా గృహాలు నిర్మించి ఇస్తున్నారని కొనియాడారు. కదిరి మున్సిపల్‌ పరిధిలో అర్హులైన 2 వేల మంది పేదలకు గురువారం ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అర్హులైన రెండు వేల మందికి ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కదిరి మున్సిపల్‌ పరిధిలో ఇప్పటికే 4 వేల మందికి ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు పక్కా గృహ నిర్మాణాన్ని కూడా మంజూరు చేశామన్నారు. తాజాగా మరో 2 వేల మందికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలకు ఇచ్చే ఖరీదైన స్థలాలపై టీడీపీ నాయకులు కన్నేశారని, దీంతో ఆ స్థలాలు పేదలకు దక్కకుండా ఏదో ఒక రీతిన అడ్డుకునేందుకు ప్రయతిస్తున్నారని మండిపడ్డారు. ఇంటి పట్టాలు, నివేశనా స్థలాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదన్నారు. ఎవరైనా డబ్బు డిమాండ్‌ చేస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

పచ్చరాతలు పట్టించుకోవద్దు..

పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు స్థలాన్ని చదును చేస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు కబ్జా చేస్తున్నారని ఎల్లో మీడియా ద్వారా టీడీపీ నాయకులు తప్పుడు కథనాలు రాయిస్తున్నారని, వాటిని ఎవరూ పట్టించుకోరాదని ఎమ్మెల్యే సిద్దారెడ్డి సూచించారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏనాడూ పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. తాజాగా అధికారం కోసం అబద్ధపు హామీలతో ప్రజల ముందుకు వస్తున్న చంద్రబాబు అండ్‌ కో బూటకపు నాటకాలను ఎవరూ నమ్మరాదన్నారు. పేదలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అంతకు మునుపు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ నజీమున్నీసా భర్త పరికి సాదిక్‌బాషా, కౌన్సిలర్లు ఎంఎస్‌ ఫయాజ్‌, ఖాసీం, షబ్బీర్‌ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీహరిబాబు, కౌన్సిలర్లు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్‌ ప్రమాదంపై విచారణ

ఎన్పీకుంట: మండల కేంద్రం సమీపంలోని కొత్త రోడ్డు వద్ద బుధవారం ఉదయం విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదంలో కదిరి మండలం బొడేనాయక్‌ తండా కు చెందిన దినసరి కూలీ రవినాయక్‌ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యుత్‌ శాఖ డీఈఈ సుబ్రహ్మణ్యం, ఏఈ సాలెహాబాషా గురువారం విచారణ చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్‌ కాంట్రాక్టర్‌ రామ్మూర్తి, విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఆపరేటర్‌ ఫోన్‌ సంభాషణ (కాల్‌ రికార్డింగ్స్‌)ను పరిశీలించాల్సి ఉందని, అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకొని, బాధితుడికి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు గోపాల్‌నాయక్‌

గాండ్లపెంట: మండలంలోని తుమ్మలబైలు పెద్ద తండాకు చెందిన రైతు బుక్యా గోపాల్‌నాయక్‌(52) విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు..... గురువారం మధ్యాహ్నం తన పొలంలోని వేరుశనగ, టమాట పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన గోపాల్‌నాయక్‌... విద్యుత్‌ మోటారు స్టార్టర్‌ బటన్‌ నొక్కగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకట నారాయణ అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఉసురు తీసిన అభిమానం

- 'సలార్‌' ఫ్లెక్సీ కడుతూ విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు బాలరాజు

ధర్మవరం అర్బన్‌: తన అభిమాన హీరో ప్రభాస్‌ సినిమా 'సలార్‌' రిలీజ్‌ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతూ ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం ధర్మవరం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్‌ పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన బాలరాజు(29) ప్రభాస్‌ వీరాభిమాని. శుక్రవారం ప్రభాస్‌ సినిమా సలార్‌ చిత్రం విడుదల కానుండడంతో గురువారం ఉదయం ధర్మవరంలోని రంగా థియేటర్‌ వద్దకు చేరుకుని ఫ్లెక్సీలు కట్టేందుకు థియేటర్‌ ఎదురుగా కర్రలతో స్టాండ్‌ ఏర్పాటు చేసుకున్నాడు. అనంతరం ఫ్లెక్సీ కడుతున్న సమయంలో బాలరాజు చేయి అటుగా వెళుతున్న విద్యుత్‌ లైన్‌కు తగలడంతో షాక్‌కు గురై కింద పడ్డాడు. స్థానికులు వెంటనే బాలరాజును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలరాజుకు భార్య శిరీష, ఇద్దరు కుమారులున్నారు. దుస్తుల వ్యాపారం చేస్తూ జీవించే బాలరాజు తన హీరో ప్రభాస్‌ సలార్‌ సినిమా రిలీజ్‌ అవుతోందని అభిమానంతో ఫ్లెక్సీలు కడుతూ ఇలా మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యులు, అభిమానులు బోరున విలపించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బాలరాజు తమ్ముడికీ గాయాలు..

బాలరాజు చిన్నాన్న కుమారుడు గజేంద్ర కూడా ప్రభాస్‌ అభిమానే. రంగా థియేటర్‌ వద్ద ఫ్లెక్సీ కడుతూ బాలరాజు విద్యుదాఘాతంతో కింద పడి మృతి చెందిన కొద్దిసేపటికే అతని తమ్ముడు గజేంద్ర కూడా రంగా థియేటర్‌ వద్ద ఫ్లెక్సీ కట్టేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో అతను కూడా విద్యుదాఘాతానికి గురై కిందపడటంతో స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

సీఎం వైఎస్‌ జగన్‌ బాగుండాలని పూజలు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు

ధర్మవరం: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి స్వగృహంలో గురువారం సాయంత్రం అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. గురుస్వామి పి.జె.విజయ్‌కుమార్‌ నేతృత్వంలో నిర్వహించిన పూజలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌ బాగుండాలని కోరుకుంటూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు, సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

అనంతపురం సిటీ: అనంతపురం జీఆర్పీ పరిధిలోని గార్లదిన్నె సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళ(50) రైలు కింద పడి గురువారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్‌ తెలిపారు. మృతురాలు ఎవరైంది తెలియరాలేదు. వేగంగా వెళ్లే రైలు కిందకు దూరడంతో శరీరం ఛిద్రమైంది. మృతరాలు ఎరుపు/పసుపు రంగు చీర ధరించింది. ఆచూకీ తెలిసిన వారు 85002 38200, 99088 37888 నంబర్లకు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

ప్రశాంతి నిలయంలో క్రిస్మస్‌ సందడి


ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేసిన క్రిస్టస్‌ ట్రీ వద్ద భక్తుల సందడి

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో క్రిస్మస్‌ సందడి మొదలైంది. తూర్పు ప్రశాంతి నిలయంలో ప్రత్యేకంగా క్రిస్మస్‌ ట్రీ ఏర్పాటు చేశారు. దేశవిదేశాలకు చెందిన భక్తులు వేడుకల్లో పాల్గొనేందుకు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు. భక్తులతో ప్రశాంతి నిలయం కిటకిటలాడుతోంది. సత్యసాయి సెంట్రల్‌ ట్రస్ట్‌ మేనేజింగ్‌ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు క్రిస్మస్‌ ట్రీ వద్ద గురువారం రాత్రి వేడుకలు ప్రారంభించారు. అనంతరం భక్తులు క్రిస్మస్‌ భక్తి గీతాలు ఆలపించారు.


వేడుకలను ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్‌ రాజు


క్రీస్తు మహిమలను స్తుతిస్తూ గీతాలను ఆలపిస్తున్న భక్తులు